ఇందిరమ్మ ఇంటి కోసం లంచం డిమాండ్

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

నారాయణఖేడ్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇంటి లంచం డిమాండ్ చేసినందుకు నిజాంపేట మండల పరిధిలోని ఈదుల్ తండా పంచాయతీ కార్యదర్శి మహబూబ్అలీని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య సస్పెండ్ చేశారు. తండాకు చెందిన లబ్ధిదారు అంగోత్ తులసీబాయి కార్యదర్శి రూ.5వేలు డిమాండ్ చేశారని టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేశారు. హౌసింగ్ పీడీ చలపతిరావు విచారణ నివేదిక ఆధారంగా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

ఏటీసీలతో నైపుణ్యాభివృద్ధి

మంత్రి దామోదర్ రాజనర్సింహ

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పోటీ ప్రపంచంలో అవకాశాలు సాధించాలంటే సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకోవాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. రాష్ట్రంలో 65 అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్ విధానంలో హైదరాబాద్ నుంచి ప్రారంభించారు. అనంతరం సంగారెడ్డిలోని ఐటీఐ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)ను శనివారం టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ యువతలో నైపుణ్యాలను వెలికి తీసేందుకే ప్రభుత్వం ఏటీసీలను ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. జిల్లాలోని సంగారెడ్డి, పటాన్‌చెరు, హత్నూర ఐటీఐలలో వీటిని ప్రారంభించామని, త్వరలోనే జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్‌లోనూ ఏర్పాటు చేస్తామని వివరించారు. ఒక్కోటి రూ.40 కోట్ల వ్యయంతో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ సహకారంతో ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేయిస్తున్నదన్నారు. అనంతరం సంగారెడ్డిలోని ఐటీఐ ప్రాంగణంలో మహిళా శిశు సంక్షేమ, వయోవృద్ధుల సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 138 మంది దివ్యాంగులకు బ్యాటరీ వాహనాలు, వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు తదితర పరికరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, ఆత్మ కమిటీ చైర్మన్ రాంరెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

వదలని వర్షం.. ఆగమాగం

సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఎడతెరిపి లేని వాన

జనజీవనం అస్తవ్యస్తం.. పంటలు నీటి పాలు

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల వల్ల అపార నష్టం వాటిల్లింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా చేతికి రావాల్సిన పంటలు నీట మునిగిపోయాయి. గ్రామాల నుంచి పట్టణాలకు వెళ్లాల్సిన ప్రధాన రహదారులు (రోడ్లు) ధ్వంసమై ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడి రాకపోకలు నిలిచిపోయాయి. బీదర్ నుంచి లింగంపల్లి మధ్య ఉన్న 65వ నంబరు జాతీయ రహదారి పక్కన వెలసిన హోటళ్లు, రెస్టారెంట్లు వరద నీటిలో మునిగిపోయాయి. జిల్లా వ్యాప్తంగా పత్తి, సోయాబీన్, వరి, చెరకు, బొప్పాయి తదితర పంటలకు అపార నష్టం కలిగింది. ● అందోల్ మండలం అల్మాయిపేట వద్ద బ్రిడ్జి పైనుంచి మంజీర నది ప్రవహించింది.

●సదాశివపేట : మండలంలోని నందికంది వద్ద 65వ జాతీయ రహదారిపై ఉన్న నందివాగు ఉధృతంగా ప్రవహించింది. పెద్దాపూర్ గ్రామం వద్ద నాగ్సాన్‌పల్లి వాగు 65వ జాతీయ రహదారి పైనుంచి ప్రవహించడంతో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఐదు కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌జామ్ అయ్యింది. అధికారులు అప్రమత్తమై సహాయక చర్యలు చేపట్టారు. హైవే పక్కన హోటళ్లు నీట మునిగాయి.



కొండాపూర్ మండలం సైదాపూర్ వద్ద తెగిన రోడ్డు

● కొండాపూర్ మండలం సైదాపూర్ వద్ద సంగారెడ్డి-వికారాబాద్ జిల్లాలను కలిపే రోడ్డు వరద నీటికి తెగిపోయింది. భారీ వర్షాలకు మల్కాపూర్ పెద్ద చెరువు అలుగు పారడంతో అవతలి వైపు ఉన్న తొగర్‌పల్లి గ్రామంలో తొమ్మిది కుటుంబాలు చిక్కుకుపోయాయి. అప్రమత్తమైన అధికారుల బృందం బోటు సహాయంతో 50 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

● జహీరాబాద్/కోహీర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రెండో రోజు ఎడతెరిపిలేకుండా వర్షం కురిసింది. జహీరాబాద్ పట్టణంలోని పలు కాలనీలు నీట మునిగాయి. భరత్‌నగర్, అల్గోల్ రోడ్డు నీట మునిగింది. పలు గ్రామాల్లో మిగతా 8వ పేజీలో



సినిమాయం.!

- బోసిపోతున్న థియేటర్లు
- కొత్తసినిమా వస్తేనే కాసింత కళ
- భయపెడుతున్న టికెట్ల రేట్లు
- ఓటీటీలకే ఓటేస్తున్న ప్రేక్షకులు
- షాపింగ్ మాళ్లుగా మారుతున్న టాకీసులు

7

బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న

నిర్మలాజగ్గారెడ్డి, జయా గుణచైతన్యరెడ్డి

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సదాశివపేటలోని భవిత జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం జరిగిన బతుకమ్మ సంబరాల్లో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, కూతురు యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు జయా గుణచైతన్యరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కళాశాల యాజమాన్యం, మహిళ అధ్యాపకులు, సిబ్బందితో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా జయారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా బతుకమ్మ పండగ ఘనంగా నిర్వహిస్తున్నామని అన్నారు. తీరొక్క పూలను పూజించే ఏకైక పండగ బతుకమ్మ పండగ అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాంరెడ్డి, వై ప్రభు పాల్గొన్నారు.



సదాశివపేట భవిత కళాశాలలో జరిగిన బతుకమ్మ సంబరాల్లో మాట్లాడుతున్న యువజన కాంగ్రెస్ నాయకురాలు జయా గుణచైతన్యరెడ్డి



సదాశివపేటలోని భవిత కళాశాలలో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, జయా గుణచైతన్యరెడ్డి



గడిపెద్దాపూర్‌లో కబ్జాను తొలగిస్తున్న గ్రామస్థులు

ఊరంతా ఒక్కటై.. ప్రభుత్వ భూమికి విముక్తి

అల్లాదుర్గం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఊరంతా ఒక్కటై రూ. కోట్లు విలువైన ప్రభుత్వ భూమిని కాపాడారు. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్‌లో శనివారం చోటుచేసుకున్న ఈ సంఘటన వివరాలు గ్రామస్థుల కథనం మేరకు ఇలా ఉన్నాయి. గడిపెద్దాపూర్ శివారులో 863/1/1 సర్వే నంబరులో 14 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో మూడెకరాలను గత ప్రభుత్వం క్రీడామైదానం కోసం కేటాయించింది. మిగిలిన 11 ఎకరాల భూమిని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నాలు మొదలుపెట్టారు. దీనిపై కలెక్టరేట్‌కు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించలేదు. ఇదే అదనుగా కబ్జాదారులు ఈ భూమిలో కడీలు వేస్తున్నారు. దీంతో, శనివారం గ్రామస్థులందరూ ఏకమై ప్రభుత్వ భూమిలో కడీలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. అనంతరం ఈ విషయంపై తహసీల్దార్ మల్లయ్యకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ భూమిని సర్వే చేయించి పరిరక్షించాలని కోరారు.

లెక్క తేలింది

ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వడమే తరువాయి

రిజర్వేషన్ల కేటాయింపుపై భిన్నాభిప్రాయాలు

కొందరికి మోదం.. మరికొందరికి ఖేదం

ఊసూరుమన్న పలువురు ఆశావహులు

పలువురి రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకం

సంగారెడ్డి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రామపంచాయతీ, పరిషత్ ఎన్నికల రిజర్వేషన్ల లెక్క తేలింది. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో జిల్లా పరిషత్ చైర్మన్ స్థానాలతోపాటు జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్‌ల రిజర్వేషన్లు ఖరారు చేశారు. సంగారెడ్డి జిల్లాలోని 25 మండలాలు, మెదక్ జిల్లాలోని 21 మండలాలకు సంబంధించిన జడ్పీటీసీ, ఎంపీపీలకు రిజర్వేషన్లు శనివారం ప్రకటించారు. సంగారెడ్డి జిల్లాలోని 261 ఎంపీటీసీ, 613 సర్పంచ్ స్థానాలు, మెదక్ జిల్లాలోని 190 ఎంపీటీసీలు, 492 సర్పంచ్ స్థానాలకు కూడా అధికారికంగా రిజర్వేషన్లు ఖరారు చేశారు. సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలకు ఆర్డీవో కార్యాలయాల్లో డ్రా విధానంలో రిజర్వేషన్లు కేటాయించారు. కలెక్టరేట్‌లో జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్లను లాటరీ తీశారు.



జహీరాబాద్ ఆర్డీవో కార్యాలయంలో రిజర్వేషన్లు వెల్లడిస్తున్న అధికారులు

రిజర్వేషన్లపై వివాదం

జడ్పీటీసీ, ఎంపీపీల రిజర్వేషన్లపై వివాదం నెలకొంది. సంగారెడ్డి నియోజకవర్గంలోని 4 మండలాలు ఉండగా 3 మండలాలకు సంబంధించిన జడ్పీటీసీ, ఎంపీపీ రిజర్వేషన్లు ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కంది మండలాన్ని బీసీలకు కేటాయించారు. దీంతో ఓసీ సామాజిక వర్గానికి చెందిన ముఖ్య నేతలు నిరుత్సాహానికి గురయ్యారు. రిజర్వేషన్లలో లోటుపాట్లు ఉన్నాయని వారు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలుస్తున్నది. ఎస్సీ జనాభా ఎక్కువగా ఉన్న అందోల్, జహీరాబాద్ మిగతా 8వ పేజీలో

పంచాయతీ, పరిషత్ రిజర్వేషన్ల ప్రకటన

సంగారెడ్డి జడ్పీ ఎస్సీ, మెదక్ జనరల్

మెదక్ జిల్లా రిజర్వేషన్ల వివరాలు

మండలం	జడ్పీటీసీ	ఎంపీపీ
చిలప్‌చెడ్	ఎస్టీ మహిళ	ఎస్టీ మహిళ
టేక్మాల్	ఎస్టీ జనరల్	ఎస్టీ జనరల్
మాసాయిపేట	ఎస్సీ మహిళ	ఎస్సీ మహిళ
నార్సింగి	ఎస్సీ జనరల్	ఎస్సీ జనరల్
అల్లాదుర్గం	ఎస్సీ జనరల్	ఎస్సీ మహిళ
వెల్దుర్తి	ఎస్సీ మహిళ	ఎస్సీ జనరల్
చేగుంట	బీసీ మహిళ	బీసీ మహిళ
పాపన్నపేట	బీసీ జనరల్	బీసీ జనరల్
మెదక్	బీసీ జనరల్	బీసీ జనరల్
చిన్న శంకరంపేట	బీసీ జనరల్	బీసీ జనరల్
రేగోడ్	బీసీ మహిళ	బీసీ జనరల్
హవేలి ఘన్‌పూర్	బీసీ జనరల్	బీసీ మహిళ
శివ్వంపేట	బీసీ మహిళ	బీసీ మహిళ
కౌడిపల్లి	బీసీ జనరల్	బీసీ మహిళ
నర్సాపూర్	బీసీ మహిళ	బీసీ జనరల్
పెద్దశంకరంపేట	జనరల్ మహిళ	జనరల్ మహిళ
మనోహరాబాద్	జనరల్ మహిళ	జనరల్
తూప్రాన్	జనరల్	జనరల్
నిజాంపేట	జనరల్ మహిళ	జనరల్ మహిళ
కొల్చారం	జనరల్	జనరల్
రామాయంపేట	జనరల్	జనరల్ మహిళ

సంగారెడ్డి జిల్లా రిజర్వేషన్ల వివరాలు

మండలం	జడ్పీటీసీ	ఎంపీపీ
నిజాంపేట	ఎస్టీ మహిళ	ఎస్టీ మహిళ
మొగుడంపల్లి	ఎస్టీ జనరల్	ఎస్టీ జనరల్
చౌటకూర్	ఎస్సీ మహిళ	ఎస్సీ మహిళ
సదాశివపేట	ఎస్సీ జనరల్	బీసీ జనరల్
కొండాపూర్	ఎస్సీ మహిళ	ఎస్సీ మహిళ
మునిపల్లి	ఎస్సీ జనరల్	ఎస్సీ జనరల్
సంగారెడ్డి	ఎస్సీ మహిళ	ఎస్సీ జనరల్
మనూరు	ఎస్సీ జనరల్	ఎస్సీ మహిళ
అందోల్	బీసీ మహిళ	బీసీ మహిళ
వట్‌పల్లి	బీసీ జనరల్	బీసీ మహిళ
కల్హేర్	బీసీ మహిళ	బీసీ జనరల్
పటాన్‌చెరు	బీసీ జనరల్	బీసీ జనరల్
న్యాల్‌కల్	బీసీ జనరల్	బీసీ జనరల్
గుమ్మడిదల	బీసీ మహిళ	బీసీ మహిళ
ఝరాసంగం	బీసీ జనరల్	బీసీ మహిళ
కంది	బీసీ మహిళ	బీసీ జనరల్
కంగ్టి	బీసీ జనరల్	బీసీ జనరల్
పుల్కల్	బీసీ జనరల్	జనరల్
జహీరాబాద్	బీసీ మహిళ	ఎస్సీ జనరల్
రాయికోడ్	జనరల్ మహిళ	బీసీ మహిళ
హత్నూర	జనరల్	జనరల్ మహిళ
సిర్గాపూర్	జనరల్ మహిళ	జనరల్
కోహీర్	జనరల్ మహిళ	జనరల్ మహిళ
నారాయణఖేడ్	జనరల్	జనరల్
నాగల్‌గిద్ద	జనరల్	జనరల్ మహిళ

రాష్ట్రస్థాయి ఉషు పోటీల్లో జిల్లాకు ప్రథమ, తృతీయ స్థానాలు

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ ఎస్ జీఎఫ్ ఉషు పోటీలు అండర్ 19 బాలురు, బాలికల విభాగంలో సంగారెడ్డి జిల్లా ప్రథమ, తృతీయ స్థానాలను కైవసం చేసుకుంది. బీరంగూడ భూపాల్ రెడ్డీ కాలేజీకి చెందిన కె. సాహితి అండర్ 19 (45 కేజీల) విభాగంలో బంగారు పథకం సాధించి రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎంపికయ్యింది. అండర్ 19 (48 కేజీల) బాలుర విభాగంలో చిట్కుల్ వడ్డెర కాలనీకి చెందిన అలకుంట ఉల్లయ్య తృతీయ బహుమతి కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా ఇద్దరినీ ఉపాధ్యాయులు స్థానికులు అభినందించారు. కుమార్ మాస్టారు కృషితోనే తాము విజయం కైవసం చేసుకున్నామని ఈ సందర్భంగా సాహితి, ఉల్లయ్యలు విలేకరులు తెలిపారు. తమకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తే తాము మరిన్ని విజయాలకు కైవసం చేసుకుంటామన్నారు. ఇరు కుటుంబాలు ఆర్థికంగా వెనకబడిన వర్గాలు అయినందున స్వచ్ఛంద సంస్థలు గాని, ప్రభుత్వం గాని వారిని ప్రోత్సహిస్తే రాష్ట్ర జాతీయ స్థాయిలో వారు మరిన్ని విజయాలు కైవసం చేసుకుని జిల్లాకు రాష్ట్రానికి మంచి పేరు తెస్తారని ఈ సందర్భంగా కోచ్ కుమార్ మాస్టర్ తెలిపారు.


ప్రథమ బహుమతి సాధించిన సాహితి కోచ్‌తో


తృతీయ బహుమతి సాధించిన ఉల్లయ్య

పూర్తికాని పుష్పాల వాగు పనులు

- ఆరు గ్రామాలు, రెండు తండాలకు నిలిచిన రాకపోకలు
- 30 రోజులైనా తాత్కాలిక మరమ్మతులకు నోచుకోలేదు
- ఆర్థిక భారంతో పాటు అత్యవసర పరిస్థితులలో ఇబ్బందులు

మెదక్, కల్చరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పుష్పాల వాగు వంతెన పరిసరాలు కొట్టుకుపోయి ఆరు గ్రామాలకు, రెండు తండాలకు రాక పోకలు నిలిచిపోయాయి. అయితే ఇప్పటికే 30 రోజులు గడుస్తున్నా నేటికి తాత్కాలిక మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఆరు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైతే కొంటూర్ నుంచి రాక పోకలు కొనసాగిస్తున్నా, వర్షం ఎక్కువైతే ఆ చెరువు అలుగు పారడం ఎక్కువైతే రాకపోకలు నిలిచిపోతాయి. ఇదే కాకుండా కొంటూరు నుంచి మెదక్‌కు రావాలంటే 14 కిలోమీటర్ లవుతుంది. దీంతో ఆర్థిక భారంతో పాటు అత్యవసర పరిస్థితులలో ఇబ్బందులు తప్పడం లేదని ఆ గ్రామాల ప్రజలు వాపోతున్నారు. వెంటనే పుష్పాల వాగు వంతెన మరమ్మతులు పూర్తి చేస్తే ఇక్కడి నుండి మెదక్‌కు 6 కిలో మీటర్ల దూరం మాత్రమే అవుతుంది దీంతో ఆర్థిక భారంతో పాటు అవస్థలు తప్పుతాయంటున్నారు. అయితే తాత్కాలిక మరమ్మతులు ప్రారంభించామని హడావిడిగా ఒక రోజు బ్రిడ్జిలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించి మళ్లీ ఆ పనిని నిలిపి వేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గోడు వింటారని తాత్కాలిక మరమ్మతులు చేసి రాకపోకలు పునరుద్ధరిస్తారని అక్కడి వారందరూ ఎదురు చూస్తున్నారు.


ఒక్క రోజు మాత్రమే జేసీబీతో చెత్త తొలగిస్తూ


బ్రిడ్జి పరిసరాలు కొట్టుకుపోవడంతో నిలిచిన రాకపోకలు

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి

- మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసులపై దృష్టి సారించి, త్వరగా పరిష్కరించాలని మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పోలీసుల అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షలో ఆయన నేరాల పరిస్థితి, పెండింగ్ కేసుల పరిణామాలు, విచారణలో ఉన్న కేసుల పురోగతి తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కేసుల సంఖ్య తగ్గించడానికి ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. పోక్స్ అండర్ ఇన్వెస్టిగేషన్ ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల్లో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ చేయాలన్నారు. కేసుల నమోదు నుంచి చార్జ్‌షీట్ దాఖలు వరకు ప్రతి దశను సమగ్రంగా పరిశీలించాలన్నారు. నేరాల నియంత్రణకు సాంకేతిక ఆధారాలతో కూడిన ఆధునిక పద్ధతులను అమలు చేయాలన్నారు. సీసీ టీవీలను కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారణ, ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్, లోన్ యాప్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సమీక్షలో అదనపు ఎస్పీ మహేందర్, మెదక్, తూప్రాన్ డీఎస్పీలు ప్రసన్నకుమార్, నరేందర్ గౌడ్, సీ ఐలు, ఎస్సైలు, అధికారులు పాల్గొన్నారు.

దాబా సీజ్ చేసిన పోలీసులు

నిజాంపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన ఓ దాబాను పోలీసులు శనివారం సీజ్ చేశారు. నిజాంపేట మండల పరిధి కల్వకుంట గ్రామ శివారులో గల భవానీ దాబా కొన్నేళ్లుగా యజమాని వెంకట్ గౌడ్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడు. దీంతో ఆర్డీవో రమాదేవికి అందిన ఫిర్యాదు మేరకు ఎస్సై రాజేష్, ఆర్ఐ ఇమద్‌లు దాబాను సీజ్‌చేసి యజమానికి నోటీసులు అందజేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

చిన్నకోడూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అనుమానస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చిన్నకోడూరులో శనివారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నకోడూరుకు చెందిన కొలనుశంకర్ (45) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం సాయంత్రం శంకర్ తన వ్యవసాయ బావి దగ్గర అనుమానస్పద స్థితిలో మృతిచెందాడు.మృతుడికి భార్య కనకవ్వ, కుమారుడు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చెరువులో దూకి బ్రేక్ డౌన్‌ను క్లియర్ చేసిన విద్యుత్ సిబ్బంది


బ్రేక్‌డౌన్‌ను క్లియర్ చేసిన సిబ్బందితో ప్రజ్ఞాపూర్ సెక్షన్ ఏఈ సత్యం

గజ్వేల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ నుంచి అహ్మదీపూర్‌కు వచ్చే 33కేవీ ఎక్స్‌ప్రెస్ ఫీడర్‌పై చెట్టుపడి బ్రేక్ డౌన్ అవడంతో విద్యుత్ సిబ్బంది ప్రాణాలకు తెగించి మరీ విద్యుత్‌ను పునరుద్ధరించారు. గజ్వేల్ నుంచి ప్రజ్ఞాపూర్ సెక్షన్‌లోని అహ్మదీపూర్ ఫీడర్‌కు వచ్చే లైన్ గజ్వేల్ పాండవుల చెరువులో చెట్టు పడి తెగిపోయింది. వెంటనే స్పందించిన ప్రజ్ఞాపూర్ విద్యుత్ లైన్‌మన్ హన్మంతు, ఏఎల్ఎం జహంగీర్‌లు పాండవుల చెరువులోకి దూకి చెట్టు కొమ్మలను నరికి, విద్యుత్ లైన్‌కు మరమ్మతులు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా హన్మంతు, జహంగీర్‌తో పాటు వారికి సహకరించిన ఆర్టీజన్ రవి, లైన్ ఇన్‌స్పెక్టర్ జయసింహారావు, జహంగీర్‌లను ప్రజ్ఞాపూర్ సెక్షన్ ఏఈ సత్యాన్ని డీఈ భానుప్రకాశ్, ఏడీ జగదీశ్‌ఆర్య అభినందించారు.

ఆల్ప్రాజోలం పట్టివేత

గజ్వేల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కల్లులో అక్రమంగా కలుపుతున్న నిషేధిత ఆల్ప్రాజోలాన్ని గజ్వేల్ పట్టణంలోని ఓ కల్లు కాంపౌండ్‌లో సిద్దిపేట టాస్క్ ఫోర్స్, గజ్వేల్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ఆర్అండ్ఆర్ కాలనీలోని పల్లెపహాడ్‌లో నలుగురు వ్యక్తులు కలసి కల్లు అమ్ముతున్నారని గజ్వేల్ అదనపు ఇన్‌స్పెక్టర్ ముత్యంరాజు తెలిపారు. మర్కుక్ మండలం పాములపర్తికి చెందిన తదురి లక్ష్మణ్‌గౌడ్, మెదక్ జిల్లా తూప్రాన్ మండలం ఇస్లాంపూర్‌కు చెందిన మెతుకు నర్సింలుగౌడ్, నార్సింగి మండల కేంద్రానికి చెందిన గౌడ శ్రీకాంత్‌గౌడ్, కాచాపూర్ గ్రామానికి చెందిన పాలమాకుల సాయికుమార్‌గౌడ్‌లు కలసి నిషేధిత ఆల్ప్రాజోలాన్ని కల్లులో కలిపి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్న సమాచారంతో దాడి చేశామన్నారు. వారివద్ద నుంచి రూ.84వేల విలువ చేసే 210 గ్రాముల నిషేదిత ఆల్ప్రాజోలం, 175 గ్రాముల మిక్స్‌డ్ అల్ప్రాజోలం, 40గ్రాముల మిక్స్‌డ్ పౌడర్, 250గ్రాముల వైట్ పౌడర్, 200గ్రాముల కట్టు, 1250 గ్రాముల సచరినే, 250 గ్రాముల సోడా, 100 గ్రాముల బ్లాక్ గ్రామ, మూడు మొబైల్ ఫోన్లు, ఒక కారు, రెండు క్యాలిక్యూలేటర్లు, నాలుగు డాడీ ప్యాకెట్లు, స్వాధీనం చేసుకుని, ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. వారితో సాయికుమార్‌గౌడ్ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

కొండా లక్ష్మణ్ అంకితభావమే యువతకు ఆదర్శం

ప్రొఫెసర్ కోదండరామ్


ఉద్యాన విశ్వవిద్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా గ్రూప్ ఫొటో

ములుగు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చిరకాల స్వప్నాన్ని సాధించడంలో శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ నాయకత్వం కీలక పాత్ర పోషించిన మార్గదర్శకులని ప్రొఫెసర్ ఎం. కోదండరామ్ అభివర్ణించారు. శనివారం ములుగు మండల కేంద్రంలోని ఉద్యాన విశ్వవిద్యాలయంలో కొండా లక్ష్మణ్ జయంతి ఉప కులపతి దండ రాజిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన జయంతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోదండరాం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం కోసం పోరాటం చేసిన వ్యక్తి కొండ లక్ష్మణ్ బాబు 110 జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఆయన చేసిన పోరాటాన్ని కొనియాడారు. అనంతరం వైస్-ఛాన్సలర్ డాక్టర్ డి. రాజి రెడ్డి మాట్లాడుతూ... బాపూజీ అవిశ్రాంత పోరాటం దార్శనికత అందరికీ ఆదర్శనీయమని తెలిపారు. బాపూజీ వ్యవసాయ అభివృద్ధి, సామాజిక న్యాయం అనే తత్వశాస్త్రంలో లోతుగా పాతుకుపోయిన రైతులను శక్తివంతం చేసే ఉద్యాన విద్య, పరిశోధన విస్తరణ సేవలను ముందుకు తీసుకెళ్లడానికి విశ్వవిద్యాలయం నిబద్ధతతో ఉందని ఆయన పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్టర్ డాక్టర్ ఏ. భగవాన్, డీన్ డాక్టర్ జె. చీనా, డాక్టర్ టి.సురేష్ కుమార్, డాక్టర్ ఎన్. శ్రీనివాసన్, డాక్టర్ ఎం.రాజశేఖర్, విశ్వవిద్యాలయ అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

రుణం చెల్లించలేదని మండిపాటు..

- మనస్తాపంతో మహిళ ఆత్మహత్యాయత్నం
- ఆసుపత్రిలో మృతి


ఆయేషా బేగం (ఫైల్)

హత్నూర, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామైక్య సంఘంలో తీసుకున్న రుణం తిరిగి చెల్లించలేదని సంఘ సభ్యులు దూషిస్తూ, మందలించడంతో మనస్తాపానికి గురైన మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. ఆమెను హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా, అక్కడ శనివారం చనిపోయింది. ఇందుకు సంబంధించిన వివరాలు.. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం కాసాల గ్రామానికి చెందిన ఆయేషాబేగం (30) కొన్ని నెలల క్రితం తన అవసరాల కోసం గ్రామైక్య సంఘంలో రుణం తీసుకుంది. మూడు నెలలుగా డబ్బులు అందక కిస్తీలు చెల్లించలేదు. దీంతో గ్రూపు సభ్యులు కొందరు ఆయేషా ఇంటికి వెళ్లి దూషించడంతో ఆమె ఈ నెల 19న క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఇన్నాళ్లు అక్కడ చికిత్స పొందిన ఆయేషా శనివారం చనిపోయింది. కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హత్నూర ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

బావిలో పడి వ్యక్తి ..

జహీరాబాద్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని రాయిపల్లి(డి) గ్రామశివారులో గల వ్యవసాయబావిలో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. జహీరాబాద్ రూరల్‌ఎస్సై కాశీనాథ్ కథనం ప్రకారం.. రాయిపల్లి(డి) గ్రామానికి చెందిన చాకలిప్రవీణ్(29) శనివారం ఉదయం మామిడి కొమ్మలు తీసుకురావడానికి బయటకు వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో ఇరుగు పొరుగు, బంధువులు వద్ద వెతికినా ఆచూకీ లభించ లేదు. తీరా గ్రామసమీపంలోని ఓరైతు వ్యవసాయబావిలో శవమై కనిపించాడు. మృతుడి తండ్రి చాకలితుకారం ఫిర్యాదుతో కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

మంజీరా బ్యారేజ్‌కు ప్రమాదం లేదు

● వాటర్ బోర్డు చైర్మన్ అశోక్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వాటర్ బోర్డు చైర్మన్ అశోక్‌రెడ్డి

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని మంజీరా బ్యారేజ్‌కు ఎలాంటి ప్రమాదం లేదని వాటర్ బోర్డు చైర్మన్ అశోక్‌రెడ్డి స్పష్టం చేశారు. సంగారెడ్డిలోని ఐబీలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 25 ఏళ్ల తర్వాత మంజీరా రిజర్వాయర్‌కు భారీగా వరద నీరు వచ్చిందని, దీంతో ఫిల్టర్ బెడ్ నీట మునిగిందన్నారు. ఈ ఫిల్టర్ బెడ్‌ను రెండు, మూడు రోజుల్లో బాగు చేయిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి వరద పరిస్థితులపై నిరంతరం సమీక్షిస్తున్నారని చెప్పారు. సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలలో అత్యధిక వర్షపాతం నమోదైందని, 2000 సంవత్సరం తర్వాత ఇప్పుడు మళ్లీ ఆ స్థాయిలో వరద వచ్చిందన్నారు. వర్షం ఎక్కువగా కురవడం వల్ల సదాశివపేట మండలం పెద్దాపూర్ వద్ద ఉన్న ఫేస్ 3,4 పంపుల వద్ద సమస్య తలెత్తిందని, మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నామన్నారు. దీనివల్ల నిలిపిన తాగునీటి సరఫరాను వెంటనే పునరుద్ధరిస్తామని చెప్పారు. అలాగే హైదరాబాద్ ప్రాంతానికి తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవని స్పష్టం చేశారు. ఫిల్టర్ బెడ్‌లకు వరద నీరు రాకుండా శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. అంతకుముందు సదాశివపేట మండలం పెద్దాపూర్, సంగారెడ్డిలోని రాజంపేట ఫిల్టర్ బెడ్‌లను ఆయన పరిశీలించారు.

పేదల భూములు లాక్కుంటారా?

● సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చుక్క రాములు



సంగారెడ్డి కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వమంటూ గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం ట్రిపుల్ ఆర్ పేరుతో పేదల భూములు లాక్కుంటారా? అని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చుక్క రాములు ప్రశ్నించారు. శనివారం సంగారెడ్డి కలెక్టరేట్ ముందు సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో కోట్ల విలువ చేసే భూములను అప్పనంగా తీసుకోవడం రైతులను మోసం చేయడమేనని అన్నారు. భూములపై ఆధారపడి బతికే అన్నదాతల బతుకులను ఆగం చేయడమేనా ప్రజాపాలన అంటే అంటూ ప్రశ్నించారు. బలవంతపు భూసేకరణ ఆపకపోతే రైతులందరినీ ఏకం చేసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ ధర్నాలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లేశం, మాణిక్యం, జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణ, నాయకులు బాగారెడ్డి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

అసమానతలపై అక్షర యుద్ధం చేసిన మహాకవి జాషువా

● కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు



జాషువా చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న స్కైలాబ్ బాబు

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మహాకవి జాషువా అసమానతలపై అక్షర యుద్ధం చేశారని కుల వివక్ష పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు అన్నారు. జాషువా 130వ జయంతి సందర్భంగా సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. భారతదేశ సామాజిక, సాహిత్య రంగంలో జాషువా కవిత్వం ఒక చైతన్య స్ఫూర్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శివకుమార్, అశోక్, డప్పోల్ల రమేశ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

దేశరాజు శ్యాంసుందర్ స్థపతికి అత్యుత్తమ పర్యాటక పురస్కారం



మంత్రి జూపల్లి నుంచి పురస్కారాన్ని అందుకుంటున్న శ్యాంసుందర్ స్థపతి

రాయపోల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని రాయపోల్ మండలం అనాజీపూర్‌కు చెందిన దేశరాజు శ్యాంసుందర్ స్థపతి అత్యుత్తమ పర్యాటక పురస్కారాన్ని అందుకున్నారు. పర్యాటకం అనే అంశంపై బాలచెలిమి మాసపత్రికలో రాస్తున్న వ్యాసాలకు గాను ఈ పురస్కారం లభించింది. పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, పర్యాటక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, డీజీపీ జితేందర్, ఎండీ వల్లూరి క్రాంతి, కిషన్‌రావు, ప్రియాంక, ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్‌రాజు పాల్గొన్నారు.

మర్పడగ క్షేత్రంలో జిల్లా జడ్జి పూజలు



విజయ దుర్గామాత ఆలయంలో పూజలు చేస్తున్న జడ్జి

కొండపాక, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం మర్పడగ విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో సిద్దిపేట జిల్లా కోర్టు జడ్జి సాయి రమాదేవి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అలాగే మల్లికార్జున స్వామి దేవాలయంలో కూడా పూజలు చేశారు. ఈ సందర్భంగా క్షేత్ర నిర్వాహకులు హరినాథ్ శర్మ ఆలయ మర్యాదలతో ఆమెను సత్కరించారు.

సినిమాయం.!

హాలు నిండినది.. నడుస్తున్న చిత్రాలు.. మా రాబోయే చిత్రాలు అంటూ కొత్త కొత్త పోస్టర్లు.. బుకింగ్ కౌంటర్ల వద్ద టికెట్ కోసం కుస్తీపట్లు.. ఇవి ఒకప్పుడు ఏ థియేటర్ దగ్గర చూసినా కనిపించిన దృశ్యాలు. గ్రామాల నుంచి ఎడ్ల బండ్లు కట్టుకుని వచ్చి మరీ సినిమాలు చూసేవారు. ఒకప్పుడు చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు ఆనందాన్ని పంచిన సినిమా హాళ్లు చిన్నబోతున్నాయి. కొత్త సినిమా వచ్చిన ఒకటి, రెండు రోజులు మినహా సినిమా హాళ్ల వద్ద సందడి కనిపించకుండా పోతోంది. అసలు గతంలో ఉన్నన్ని థియేటర్ల స్థానంలో షాపింగ్ కాంప్లెక్స్‌లు.. ఫంక్షన్ హాళ్లు వచ్చేశాయి.



- తగ్గుతున్న ప్రేక్షకులు
- బోసిపోతున్న థియేటర్లు
- కొత్తసినిమా వస్తేనే కాసింత కళ
- భయపెడుతున్న టికెట్ల రేట్లు
- వాటి స్థానంలో షాపింగ్ మాళ్లు
- ఓటీటీలకే ఓటేస్తున్న ప్రేక్షకులు





మెదక్, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): మెదక్‌లోని ఓ థియేటర్‌కు ముగ్గురు స్నేహితులు ఓ సినిమా చూద్దామని వెళ్లారు. షో టైం అవుతున్నా.. టికెట్లు ఇవ్వకపోవడంతో అక్కడున్న సిబ్బందిని ఆరా తీయగా.. 'మీతో పాటు మరొకరు వచ్చారు సార్.. నలుగురితో సినిమా నడపలేం' అంటూ సమాధానం ఇచ్చారు. దీంతో చేసేదేమీ లేక ఆ ముగ్గురు మిత్రులు తిరుగుముఖం పట్టారు. ఒకప్పుడు హౌస్‌ఫుల్‌తో కిటకిటలాడిన థియేటర్లలో 30-40 మంది కూడా కనిపించడం లేదు. ఇందుకు కారణాలు అనేకం. ఒకప్పుడు అందరికీ అందుబాటులో ఉండే సినిమా టికెట్ల రేట్లు పెరిగిపోయాయి. వందలు పెడితే తప్ప సినిమా చూసే పరిస్థితి కనిపించడం లేదు. ఇక థియేటర్ వరకు రానుపోను రవాణా ఖర్చులు, థియేటర్‌లో తినుబండారాల రేట్లు వెరసి ప్రేక్షకులు థియేటర్ల వైపు రావడం మానుకున్నారు. ప్రస్తుత పరిస్థితిల్లో మెదక్ లాంటి పట్టణంలోనే నలుగురున్న కుటుంబం మొత్తం సినిమా చూడాలంటే రూ. వెయ్యి వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. దీంతో చాలా మంది థియేటర్లకు రావడం మానేశారు.



మూతపడుతున్న థియేటర్లు

మెదక్ జిల్లా కేంద్రంలో సినిమా థియేటర్ల ప్రస్థానం చిన్నదే. మొదటి థియేటర్ 1981లో చక్రధారి ప్రారంభమైంది. యారానా అనే హిందీ సినిమాతో ఈ థియేటర్‌ను ప్రారంభించారు. తర్వాత మయూర 1984లో ప్రారంభమైంది. కృష్ణంరాజు హీరోగా నటించిన బొబ్బిలి బ్రహ్మన్న సినిమాతో ఈ థియేటర్‌లో ప్రదర్శనలు ప్రాంభమయ్యాయి. ఈ థియేటర్ తర్వాతి కాలంలో మేనేజ్‌మెంట్ మారి గంగినేనిగా మారింది. తర్వాత సంఘం థియేటర్ ప్రారంభమైనా ఇప్పుడది మూత పడింది. త్వరలోనే ఇక్కడ షాపింగ్ మాల్ పెడుతున్నారు. సాయి థియేటర్ జ్ఞాపకంగా మారిపోయింది.

ఓటీటీల హవా..

సినిమా హాళ్లకు ప్రేక్షకులు తగ్గేందుకు ఓటీటీలు కూడా కారణమని అంటున్నారు. ఏదైనా సినిమా విడుదల అయిన రెండు మూడు నెలల్లోనే ఓటీటీ ఫ్లాట్‌ఫాంలోకి వచ్చేస్తోంది. అంత ఖర్చు పెట్టి కుటుంబం మొత్తం థియేటర్‌కు వెళ్లలేని చాలా మంది హాయిగా ఇంట్లోనే ఓటీటీల్లో సినిమాలను ఎంజాయ్ చేస్తున్నారు. వాస్తవానికి ఇళ్లలోనూ పెద్ద పెద్ద టీవీలు అందుబాటులో ఉండగా, సోఫాలో సేద దీరుతూ కుటుంబమంతా కలిసి తమకు ఇష్టమైన సమయంలో సినిమాను ఎంజాయ్ చేస్తున్నారు. ఓటీటీల సబ్‌స్క్రిప్షన్ కూడా తక్కువకే వస్తుండటంతో అందరూ వీటికే మొగ్గుచూపుతున్నారని మెదక్‌కు చెందిన ఆరునార్తి చంద్రశేఖర్ గుప్తా అభిప్రాయపడ్డారు. ఓటీటీల్లో సినిమా అయితే ఇంట్లో పనులు చేసుకుంటూ.. తీరిక సమయంలో చూసుకునే అవకాశం ఉంటుందని ఓ గృహిణి పేర్కొన్నారు. మొబైల్, ల్యాప్‌ట్యాప్, టీవీల్లో కొత్త సినిమాలు, వెబ్ సిరీస్ చూసే సౌకర్యం లభించడంతో జనం సినిమా థియేటర్లకు వెళ్లడం లేదని బట్టి రాజాగౌడ్ అంటున్నారు.

నేరుగా ఓటీటీల్లోనే..



చిన్న సినిమా నిర్మాతలు నేరుగా ఓటీటీల్లో తమ సినిమాలు విడుదల చేస్తున్నారు. మీడియం రేంజ్ సినిమాలు రెండు మూడు వారాల్లోనే ఓటీటీల్లోకి వచ్చేస్తున్నాయి. ప్రేక్షకులు తగ్గడంతో చాలావరకు సినిమా థియేటర్లు మూతపడుతున్నాయి. కనీసం విద్యుత్ బిల్లులో రాయితీలు ఇవ్వకపోతే రానున్న రోజుల్లో సింగిల్ స్క్రీన్ థియేటర్లు అనేవి కనిపించకుండా పోయే ప్రమాదముంది.

- చింతల వినోద్, బొబ్బిలిదొర సినిమా నిర్మాత

పదేళ్లకు తెరుచుకున్న పదిగేట్లు

● కర్ణాటక, మహారాష్ట్ర నుంచి సింగూరుకు భారీ వరద



సింగూరు ప్రాజెక్టు నుండి విడుదలవుతున్న జలాలు

పుల్కల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మంజీర నది పరివాహక ప్రాంతం విస్తరించి ఉన్న కర్ణాటక, మహారాష్ట్రల నుంచి సింగూరు ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. గత నెల రోజులుగా విరామం లేకుండా సింగూరు ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరుతుండటంతో క్రస్ట్ గేట్లను ఎత్తి ఉంచారు. వరద ప్రవాహం అధికంగా ఉండటంతో పదేళ్ల తర్వాత 17 గేట్లలో 10 గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 89,615 క్యూసెక్కులు నమోదుకాగా, ఔట్‌ఫ్లో 89,165 క్యూసెక్కులు నమోదైంది. శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రాజెక్టులో 18.212 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి.

నీట మునిగిన పంటలు..

సింగూరు ప్రాజెక్టు పది గేట్లు ఎత్తి వరద నీరు దిగువకు విడుదలవుతుండటంతో నది పరివాహక ప్రాంతంలోని వేలాది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. దాదాపు లక్ష క్యూసెక్కుల నీరు వస్తుండటంతో వరి, పత్తి, కంది తదితర పంటలన్నీ నీట మునిగాయి. చౌటకూర్ సమీపంలో మంజీర నదిపై నిర్మించిన కొన్యాల వంతెనపై నుంచి మూడు మీటర్ల ఎత్తులో వరద నీరు ప్రవహిస్తోంది. నదికి చేరువలో ఉన్న లింగంపల్లి గ్రామం వరకు వరద నీరు రావడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.



కొనసాగుతున్న రైల్వే హాల్ట్‌స్టేషన్ పనులు

దసరాకు ప్రారంభం లేనట్టే !

● నత్తనడకన రైల్వే హాల్ట్ స్టేషన్ పనులు
● నెరవేరని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హామీ

కొమురవెల్లి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లన్న క్షేత్రానికి సమీపంలో సుమారు రూ.3 కోట్లతో నిర్మిస్తున్న రైల్వే హాల్ట్ స్టేషన్ నిర్మాణ పనులు నత్తనడకలా నెమ్మదిగా సాగుతున్నాయి. స్వామివారి దర్శనానికి తెలంగాణ నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం రాజీవ్ రహదారికి దగ్గరలో దీన్ని నిర్మిస్తున్నారు. ఈ దసరా నాటికి మల్లన్న హాల్ట్ రైల్వే స్టేషన్ ప్రారంభిస్తామని గతంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపినా పనుల్లో వేగం పుంజుకోవడం లేదు. కాంట్రాక్టర్ నిర్మాణ పనులను నెమ్మదిగా చేస్తుండటంతో దసరా నాటికి ప్రారంభించే అవకాశాలు ఏ కోణంలోనూ కనిపించడం లేదు.

జాతర వరకైనా పూర్తయ్యేనా..?

రైల్వే హాల్ట్ స్టేషన్ నిర్మాణ పనులు 90 శాతం పూర్తయ్యాయని, దసరా నాటికి ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని గతంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కానీ వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు అనుగుణంగా లేదు. 90 శాతం పనులు పూర్తయినా, మిగిలిన 10 శాతం పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతున్నది. స్టేషన్ స్వాగత ద్వారం, విద్యుత్ పనులు, కుళాయిల బిగింపు, వాటర్ సౌకర్యానికి సంబంధించిన పనులు ఇంకా పూర్తికాలేదు. ఈ పనులు పూర్తికావడానికి మరికొంత సమయం పట్టేలా ఉంది. మరో రెండు నెలల్లో జాతర ప్రారంభం కానుంది. జాతర నాటికైనా రైల్వే స్టేషన్‌ను ప్రారంభిస్తే పలు రాష్ట్రాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని భక్తులు కోరుకుంటున్నారు.

అధికారులు చొరవ చూపాలి..



దసరాకు రైల్వే స్టేషన్ ప్రారంభమవుతుందని అనుకున్నాం. కానీ ఇప్పటికి పనులు కొనసాగుతున్నాయి. కేంద్రమంత్రులు, రైల్వే అధికారులు చొరవ చూపి మిగిలిన పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలి.

-కొండ శ్రీధర్, కొమురవెల్లి



వర్గల్



మర్పడగ



ఏడుపాయల



కేతకి

శరణు.. మాతా

వర్గల్/పాపన్నపేట/ఝరాసంగం/కొండపాక, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వర్గల్ విద్యాధరి క్షేత్రంలోని విద్యా సరస్వతీ, ఏడుపాయల వన దుర్గమ్మ, కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలోని దుర్గాదేవి అమ్మవార్లు శనివారం లలితా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కొండపాక మండలం మర్పడగ విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో విజయదుర్గా మాత శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది.

ఘనంగా సీఎస్ఐ 79వ ఆవిర్భావ దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

మెదక్, కల్చరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా (సీఎస్ఐ) 79వ ఆవిర్భావ దినోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు డయాసిస్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలతోపాటు పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మహాదేవాలయంలో క్రైస్తవ సోదరులనుద్దేశించి చర్చి ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య దైవ సందేశం అందించారు. అనంతరం చర్చి ప్రధాన ద్వారం నుంచి నృత్యాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మత గురువులు సంపత్, శాంసన్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



వసతి గృహాల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 27 : ప్రఖ్యాతిగాంచిన సీఎస్ఐ మహాదేవాలయం అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. స్పెషల్ డెవలప్‌మెంట్ కింద మంజూరైన రూ.9 కోట్ల అభివృద్ధి పనులకు ఆయన శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చర్చిలో యాత్రికులకు సరైన వసతులు లేకపోవడం దురదృష్టకరమన్నారు. అంతర్గత రహదారుల నిర్మాణానికి రూ.3కోట్లు, 100 మంది సౌకర్యార్థం రూ.2.50 కోట్లతో వసతి గృహం, మరో రూ.4.5 కోట్లతో వసతి గృహాల నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు వివరించారు. ఇప్పటికే రూ. 18.50 లక్షలతో పూర్తి చేసుకున్న డివైడర్ సెంటర్ లైటింగ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్, నాయకులు బొజ్జ పవన్, శాంసన్ బాణి తదితరులు ఉన్నారు.

న్యూస్ బాక్స్

చాముండేశ్వరీ ఆలయంలో తనిఖీలు



ఆలయంలో జాగిలంతో తనిఖీ చేస్తున్న పోలీసులు

చిలప్‌చెడ్ సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చిలప్‌చెడ్ మండలంలోని ప్రసిద్ధిచెందిన చాముండేశ్వరీ ఆలయంలో భక్తుల భద్రత కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ నర్సింహులు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల సూచన మేరకు డాగ్‌స్క్వాడ్ సహాయంతో ఆలయ ప్రాంగణం, ప్రధాన ద్వారం, మండపాలు, చుట్టుపక్కల ప్రదేశాలను పరిశీలించినట్లు తెలిపారు. నవరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా, విజయవంతంగా కొనసాగేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

'ఎన్నికలకు అధికారులు సమాయత్తం కావాలి'



ఎన్నికల అధికారుల శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీవో సత్తయ్య

కంగ్టి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు ఎన్నికల అధికారులు సమాయత్తం కావాలని ఎంపీడీవో సత్తయ్య సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారులకు నిర్వహించిన శిక్షణా శిబిరంలో మాట్లాడారు. శిక్షణలో తెలుసుకున్న అంశాలను ఆచరణలో పెట్టి ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రహీమోద్దీన్, శిక్షకులు కిఫాయత్ అలీ, సంగ్‌శెట్టి పాల్గొన్నారు.

'కార్మికులకు దసరా బోనస్ ఇవ్వాలి'

నారాయణఖేడ్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : దసరా పండుగను పురస్కరించుకొని బోనస్‌తో పాటు మూడునెలలకు సంబంధించిన నిత్యావసర సరుకులను ఇవ్వాలని కోరుతూ శనివారం ఖేడ్ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, సీఐటీయూ ఆధ్వర్యంలో కమిషనర్ జగ్జీవన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఖేడ్ ప్రాంత కార్యదర్శి రమేష్, మున్సిపల్ కార్మిక సంఘం బాధ్యులు చంద్రకళ, శకుంతల, సాయమ్మ, సిద్ధమ్మ, నర్సమ్మ, రాజు, సాయిలు, రవి, సుధాకర్, కార్మికులు, పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : తహసీల్దార్

టేక్మాల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మంజీరా పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమతంగా ఉండాలని టేక్మాల్ తహసీల్దార్ తులసీరాం తెలిపారు. ఎగువన ఉన్న సింగూరు నుంచి అధికంగా నీరు ప్రవహిస్తుందని, పరిసరాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మంజీరా నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో చల్లపల్లి, గుండువాగు బ్యాక్ వాటర్ రావడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

చేగుంట తహసీల్దార్‌గా శివప్రసాద్

చేగుంట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : చేగుంట తహసీల్దార్‌గా శివప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. మండలంలోని భూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.





మెదక్ అర్బన్ : బతుకమ్మ ఆడుతున్న మహిళా ఉద్యోగులు, సిబ్బంది, బతుకమ్మను ఎత్తుకున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్

అంబరాన్నంటిన బతుకమ్మ సంబురం

- పండుగల ఔన్నత్యాన్ని భావితరాలకు తెలియపరచాలి
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో బతుకమ్మ సంబరాలను శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. వివిధ శాఖల మహిళా ఉద్యోగులు తీరొక్క పూలతో పేర్చిన భారీ బతుకమ్మలతో కలెక్టరేట్ ప్రాంగణానికి చేరుకున్నారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ జ్యోతి ప్రజ్వలన, పూజలు చేసి బతుకమ్మ వేడుకలను ప్రారంభించారు. బతుకమ్మల చుట్టూ మహిళా ఉద్యోగులు, సిబ్బంది బతుకమ్మ పాటలకు ఆటలు ఆడుతూ నృత్యాలు చేస్తూ సందడి చేశారు. కలెక్టర్ కుటుంబసభ్యులు, మహిళాలతో కలిసి బతుకమ్మ ఆటలు ఆడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావు, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

●సంగారెడ్డి అర్బన్ : సంగారెడ్డిలోని శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ జూనియర్ కళాశాలలో శనివారం బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

●నర్సాపూర్: నర్సాపూర్ సమీపంలోని విష్ణుఫార్మసీ కాలేజీలో శనివారం బతుకమ్మ సంబురాలు విద్యార్థులు, ఫ్యాకల్టీ, సిబ్బంది కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్ పాల్గొన్నారు.

●చిలప్‌చెడ్ : మండలం పరిధిలోని జగ్గంపేట తదితర గ్రామాల్లో శనివారం బతుకమ్మ పండుగను నిర్వహించారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను ఉంచి ఆటపాటలో సంబరాలు జరుపుకున్నారు.

●టేక్మాల్ : మండలంలోని పల్వంచ, బర్దీపూర్ గ్రామల్లో సద్దుల బతుకమ్మ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు.



సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనీస్ జూనియర్ కాలేజీలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

- ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట/హత్నూర, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల హామీలను వందరోజుల్లోపు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రజలను మోసం చేసిందని ఎమ్మెల్యే సునీతారెడ్డి విమర్శించారు. శనివారం స్వగ్రామం గోమారంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వర్షాలతో దెబ్బతిన్న ప్రాంతాన్ని స్వయంగా సీఎం పరిశీలించి 20 రోజులు గడుస్తున్నా కొట్టుకుపోయిన రోడ్లకు, కూలిపోయిన ఇండ్లకు నష్టపరిహారం మంజూరు చేయకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రగౌడ్ పాల్గొన్నారు. కాగా దసరా సందర్భంగా గోమారంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రగౌడ్ సొంత నిధులతో 40 డప్పులను ఎమ్మెల్యే చేతులమీదుగా దళితులకు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన చండి మౌనికకు మంజూరైన రూ.30 వేల సీఎం సహాయనిధిని ఎమ్మెల్యే అందజేశారు. మండల కేంద్రమైన హత్నూరలో ఏర్పాటు చేసిన ఏటీసీ సెంటర్‌ను ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్బలక్ష్మి, అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, నాయబ్ తహసీల్దార్ దావుద్ పాల్గొన్నారు.



గోమారంలో మాట్లాడుతున్న సునీతారెడ్డి

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తాచాటాలి

చేగుంట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తాచాటాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. చేగుంట మండలం వడియారంలో దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గామాతను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను, ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను శాలువాతో సన్మానించారు. రాబోయే స్థానిక సంస్థల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అమ్మవారి వద్ద మాజీ ఎంపీటీసీ బక్కి రమేష్, లక్ష్మి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మోదం శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



వడియారం గ్రామంలో దుర్గామాతను దర్శించుకుని పూజలు చేస్తున్న ప్రభాకర్‌రెడ్డి

ముంపు ప్రాంతాల రైతులను ప్రభుత్వం అదుకోవాలి

- సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కొండాపూర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పంట నష్టపోయిన రైతులు ఆత్మవిశ్వాసం కోల్పోకుండా ధైర్యంగా ముందుకు సాగేలా ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం భారీ వర్షాలకు సైదాపూర్ శివారులో కొట్టుకుపోయిన బర్రెలక్క వాగుపై ఉన్న రోడ్డును, నీట మునిగిన పంటలను పరిశీలించి మాట్లాడారు. సదాశివపేట నుంచి కొండాపూర్ మండలం వివిధ గ్రామాలను కలుపుతూ వికారాబాద్ జిల్లాను అనుసంధానం చేసే రోడ్డు ధ్వంసం అవ్వడంతో ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందన్నారు. సైదాపూర్ ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాల కారణంగా తెగిపోయిన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వీడి పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ పర్యవేక్షణలో తహసీల్దార్ అశోక్, మాజీ సర్పంచులు రమాగౌడ్, మల్లాగౌడ్, బీఆర్ఎస్ మండల నాయకులు పాల్గొన్నారు.

మహిపాల్‌రెడ్డి కుటుంబానికి పరామర్శ

మనోహరాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మనోహరాబాద్‌కు చెందిన సర్పంచుల ఫోరం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు మూడురోజుల క్రితం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. అన్నివిధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఇందులో బీఆర్ఎస్ నాయకులు ర్యాకాల శేఖర్‌గౌడ్, హరికృష్ణ జావిద్, మహేష్‌గౌడ్ ఉన్నారు.



సదాశివపేట : కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డిలో లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ మాధురి

కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివి

కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివని పలువురు పేర్కొన్నారు. శనివారం స్వాతంత్ర్య సమరయోధుడు లక్ష్మణ్ బాపూజీ 110వ జయంతిని మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తెలంగాణ కోసం మంత్రి పదవిని త్యాగం చేసిన నిజమైన త్యాగధనుడని కొనియాడారు. - న్యూస్ నెట్‌వర్క్



సంగారెడ్డి క్రైం: లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న ఏఎస్పీ రఘునందన్‌రావు



మెదక్ మున్సిపాటిటీ లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి



మెదక్ అర్బన్ : కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



సంగారెడ్డిలో బాపూజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ మాధురి

లెక్క తేలింది

(5వ పేజీ తరువాయి)

నియోజకవర్గాల్లోని మెజార్టీ స్థానాలను మాత్రం బీసీలు, జనరల్ వర్గాలకు కేటాయించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మెదక్ అసెంబ్లీ నియోజకవర్గంలోని అన్ని మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలలో మెజార్టీ శాతం బీసీలకు, ఆ తర్వాత జనరల్ కోటాలో ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీల జనాభా ఉన్నప్పటికీ ఒక్క మండలానికి అవకాశం దక్కలేదు.

ఆ మండలాలకే సంగారెడ్డి జడ్పీ పీఠం

సంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్ స్థానాన్ని ఎస్సీ జనరల్‌కు కేటాయించారనే సంకేతాలు వచ్చాయి. దీంతో ఆయా మండలాల నుంచి ఎస్సీ జనరల్ స్థానాల్లో గెలిచిన వారికే అవకాశం దక్కుతుంది. ఎస్సీ మహిళలు సైతం పోటీలో ఉండవచ్చు. ప్రధానంగా సదాశివపేట, మనూరు, మొగుడంపల్లి, మునిపల్లి, కొండాపూర్, సంగారెడ్డి, చౌటకూర్ మండలాల్లో జడ్పీటీసీలుగా గెలిచే అభ్యర్థులకు అవకాశం ఎక్కువగా ఉంది. ఇక మెదక్ జిల్లా జడ్పీ చైర్మన్ స్థానాన్ని జనరల్‌కు కేటాయించినట్లుగా తెలుస్తోంది. ఇందులో సమీకరణాల ఆధారంగా 21 మండలాల్లో జడ్పీటీసీలుగా గెలిచిన వారందరికీ అవకాశం ఉంటుంది. జనరల్ స్థానంలో బీసీ,ఎస్సీ, ఎస్టీ వర్గాలు కూడా పోటీ పడవచ్చు. కాగా ఈ ఎన్నికల్లో అదృష్టం ఎవరిని వరిస్తుందో వేచిచూడాలి.

వదలని వర్షం.. ఆగమాగం

(5వ పేజీ తరువాయి)

పంటలు నీటమునిగాయి. కోహీర్ మండలంలోని గొటిగర్‌పల్లి పెద్దవాగు ప్రాజెక్టు అలుగు పారడంతో నీరు దిగువన కర్ణాటకకు వెళ్తున్నాయి. నారింజ వాగు పొంగిపొర్లుతుండటంతో పరివాక ప్రాంతాల్లో పొలాలు నీట మునిగాయి. పీచేర్యాగడి గ్రామంలో ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. మనీయార్‌పల్లిలో ఇల్లు కూలడంతో ఒకరికి గాయాలయ్యాయి.

●నారాయణఖేడ్/నాగల్‌గిద్ద/మనూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ డివిజన్‌లో కుండపోత వర్షం కురిసింది. మన్సూర్‌పూర్ వాగు పొంగడంతో నారాయణఖేడ్ నుంచి కంగ్టి, సిర్గాపూర్, కామారెడ్డి జిల్లా పిట్లం తదితర ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. హన్మంత్‌రావుపేట, మాద్వార్ మధ్య కూడా రాకపోకలు నిలిచిపోయాయి. నాగల్‌గిద్ద మండలంలో 450 ఎకరాల్లో పత్తి, సోయాబీన్ పంటలు నీటిమునిగాయి. మనూరు మండలంలో పెసర, మినుము, పత్తి, చెరకు పంటలకు తీరని నష్టం వాటిల్లిందని రైతులు పేర్కొంటున్నారు. మాయికోడ్ వాగు పారుతుండడంతో మాయికోడ్, మనూరు మధ్యన వాహనాలను పోలీసులు నిలిపివేశారు.

మెదక్ జిల్లాలో..

మెదక్/పాపన్నపేట/హవేళిఘణపురం/పెద్దశంకరంపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లావ్యాప్తంగా శనివారం మోస్తరు వర్షం కురిసింది. సింగూరు నుంచి నీరు వదలడంతో ఘనపురం వనదుర్గా ప్రాజక్ట్ పొంగిపొర్లుతున్నది. ఆనకట్ట పైనుంచి 1.20 లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నది. మంజీర ఉధృతికి ఏడుపాయల ఆలయం ఎదుట ఉన్న లడ్డు ప్రసాదం కౌంటర్, క్యూలైన్లు కొట్టుకు పోయాయి. ఏడుపాయలలోని మూడో బ్రిడ్జి, ఎల్లాపూర్ బ్రిడ్జి పైనుంచి మంజీర ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిపివేశారు. పాపన్నపేట, టేక్మాల్ మండలాల నుంచి మెదక్ వెళ్లే రహదారులు మూతపడ్డాయి. పెద్దశంకరంపేట పట్టణంతో పాటు మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో ప్రజలు అవస్థలు ఎదుర్కొన్నారు.



సదాశివపేట మండలం పెద్దాపూర్ గ్రామం వద్ద ఫేమస్ టీపాయింట్‌లోకి చేరిన వరద నీరు



ఏడుపాయల వద్ద కొట్టుకుపోతున్న లడ్డూ కౌంటర్

వరద బాధితులకు ప్రభుత్వం అండ : ఎమ్మెల్యే

హవేళిఘణపూర్/రామాయంపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు తెలిపారు. శనివారం మండలంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)ని ప్రారంభించి మాట్లాడారు. ఏటీసీలో శిక్షణ పొందిన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి జీవితంలో స్థిరపడే విధంగా ఉండేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వర్షానికి నష్టపోయిన అందరినీ ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గతనెలలో కురిసిన భారీ వర్షాలకు రాజీపేట గ్రామానికి చెందిన యాదాగౌడ్, సత్యనారాయణ గ్రామ సమీపంలోని గంగమ్మ వాగులో కొట్టుకుపోయి చనిపోయారు. కాగా వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5 లక్షల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సింధురేణుక, మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రపాల్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పరశురాంగౌడ్, మాజీ ఎంపీటీసీ రాములు, సుభాష్‌నాయక్ పాల్గొన్నారు. అలాగే రామాయంపేట-సిద్దిపేట రూట్‌లో ఏర్పాటు చేసిన బటర్‌ఫ్లై లైట్లను ఎమ్మెల్యే రోహిత్‌రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి సుప్రభాత్‌రావు, మాజీ ఎంపీపీ రమేష్‌రెడ్డి, దేమే యాదగిరి, చింతల స్వామి పాల్గొన్నారు.

కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు

- లలితా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు



అల్లాదుర్గంలో లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

అల్లాదుర్గం/పెద్దశంకరంపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : దేవీ శరన్నవరాత్రి వేడుకలు అల్లాదుర్గంలో వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం దుర్గామాత లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గామాత భవానీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారికి ప్రముఖ పురోహితులు శిలాంకోట ప్రవీణ్‌శర్మ నేతృత్వంలో లక్ష పుష్పార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం చేపట్టారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెద్దశంకరంపేటలో అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవిగా దర్శనం ఇచ్చారు. పేటలో గడికోటలో, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో, గంగపుత్ర యూత్ భవానీ కమాన్, భవానీ మందిరం, దుర్గాభవానీ మందిరంలో అమ్మవారిని చెరకు గడలు, అరటి ఆకులు, పలురకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

ధనలక్ష్మి అవతారంలో వాసవీమాత

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణ శివారులోని వాసవీ మాత ఆలయంలో ధనలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చి పూజలందుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ తోపాజి అనంతకిషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు సామూహిక కుంకుమార్చనలు, పూజలు నిర్వహించారు.

వాసవీమాత ఆలయంలో ధనలక్ష్మిగా కొలువుదీరిన మాత



పోరాటాల ఫలితంగానే రిజర్వేషన్లు



జావేద్

సదాశివపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సుదీర్ఘ పోరాటాల ఫలితంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించుకోవడం జరిగిందని బీసీ సంఘం యువజన జిల్లా అధ్యక్షుడు జావేద్ అన్నారు. శనివారం సదాశివపేటలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చారిత్రక ప్రాధాన్యత సంతరించుకున్న 42 శాతం రిజర్వేషన్ల అమలు ప్రక్రియ స్వాగత నిర్ణయమన్నారు. అందుకు సీఎం రేవంత్‌రెడ్డికి జావేద్ కృతజ్ఞతలు తెలిపారు. ఆలస్యమైనా 2 కోట్ల మంది బీసీలకు న్యాయం జరిగిందన్నారు. ఇది బీసీలు సాధించిన విజయమన్నారు. అన్ని రాజకీయ పార్టీలు 42 శాతం రిజర్వేషన్లను సమర్థించాలని జావేద్ కోరారు.

'బహుజనుల ఐక్యతకు పాటుపడాలి'

నిజాంపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బహుజన బతుకమ్మ ఉత్సవమే కాదు ఉద్యమమని, బహుజనుల ఐక్యత కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని రైతు కూలీ సంఘం మెదక్ జిల్లా అధ్యక్షుడు బోనాల స్వామి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం బహుజన బతుకమ్మ కార్యక్రమ పత్రాన్ని విడుదల చేసి మాట్లాడారు అరుణోదయ సాంస్కృతిక అధ్యక్షురాలు విమలక్క సారథ్యంలో ఆదివారం మండలంలోని కల్వకుంట గ్రామంలో బహుజన బతకమ్మ నిర్వహిస్తున్నామని, మండలంలోని ప్రతీ బహుజన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు గడ్డం మహేష్, సూరంపల్లి మహేందర్, ఎమ్మార్పీఎస్ పొలిట్‌బ్యూరో రాష్ట్ర సభ్యుడు మురళీ, సుధాకర్, బాబు పాల్గొన్నారు.

పాపన్నపేటలో పెట్రోల్ పంప్ ప్రారంభం



పాపన్నపేటలో పెట్రోల్ బంకును ప్రారంభిస్తున్న ఎంపీ సురేష్‌షెట్కార్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

పాపన్నపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానికంగా పెట్రోల్ బంకుల ఏర్పాటుతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. మండల కేంద్రమైన పాపన్నపేటలో హెచ్‌పీ పెట్రోల్ పంప్‌ను వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బంకు యజమానులు రాజశేఖర్, మహేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోవింద్‌నాయక్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంతప్ప, ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.